ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
వనపర్తి
జిల్లా వార్తలు
ఆదివారం 30 మార్చి 2025
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 39.0 । కనిష్ఠం : 26.0





సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

స్నేహితుడే.. సూత్రధారి

- దారిదోపిడీ చేసి పట్టుబడిన దొంగల ముఠా
- కేసును ఛేదించిన పోలీసులు
- ఐదుగురి అరెస్టు.. ఐఫోన్, రూ.1,500 నగదు స్వాధీనం

6



ఉత్సవ విగ్రహంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

ఘనంగా పాగుంట వెంకన్న కల్యాణం

- గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలో వైభవంగా ఉత్సవాలు

7

మెరుగైన వైద్యమే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి



ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకుంటున్న చిన్నారెడ్డి

వనపర్తి వైద్యవిభాగం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం కల్పించి, మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. శనివారం ఆయన జిల్లా జనరల్ ఆస్పత్రిని అకస్మికంగా తనిఖీ చేశారు. రెండు గంటల సమయం ఆస్పత్రిలో గడిపిన ఆయన ప్రతీ వార్డును పరిశీలించారు. స్టాఫ్ నర్సుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ఎన్ని వైద్య పోస్టులు, స్టాఫ్ నర్సు పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరాలు సేకరించారు. అనంతరం సెక్యూరిటీ, శానిటేషన్, పేషంట్ కేర్ కార్మికులతో మాట్లాడి వేతనాల చెల్లింపు ప్రక్రియ ఎలా జరుగుతోందని, నెలకు ఎంత వేతనం పొందుతున్నారని, సౌకర్యాలు ఎలా ఉన్నాయని ఆరా తీశారు. పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా జమ అవుతుందా అని అడిగి తెలుసుకున్నారు. డైట్ నాణ్యతను కొనసాగించాలని సూచించారు. ఆసుపత్రిలో వైద్యులు అసౌకర్యంగా ఇబ్బంది పడుతున్నారా.. అని సూపరింటెండెంట్, ఆర్ఎంవోలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జోగు శాంతన్న, నందిమల్ల యాదయ్య, ఎండీ బాబా, జిల్లెల ప్రవీణ్‌కుమార్, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గంధం నాగరాజు తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇల్లు పరిశీలన



పనులను పరిశీలిస్తున్న అధికారులు

పాన్‌గల్, మార్చి29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఆరు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో భాగంగా ఎన్నిక చేసిన పైలెట్ గ్రామ పంచాయతీ అయినా మాదవరావుపల్లిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ పర్వతాలు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఇల్లు లేని ప్రతీ పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామన్నారు. నిబంధనల మేరకు ఇల్లు నిర్మాణం చేసుకోవాలని, బేస్‌మెంట్ స్థాయిలోని ఇళ్లకు త్వరలో నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. ఎంపీడీవో గోవింద రావు, పంచాయతీ కార్యదర్శి శ్రీరామ్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు.. సర్వం సిద్ధం

- వారం రోజుల్లో వరి కోతలు ప్రారంభం
- కొనుగోళ్లపై సమీక్షించిన కలెక్టర్
- జిల్లా వ్యాప్తంగా 414 కేంద్రాల ఏర్పాటు
- వారం రోజుల్లో తెరుచుకోనున్న కొనుగోలు కేంద్రాలు
- లక్ష్యం 3 లక్షల 40వేల మెట్రిక్ టన్నులు



వనపర్తి మార్కెట్‌లో ధాన్యం తూకం చేస్తున్న హమాలీలు (ఫైల్)

వనపర్తి అర్బన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్‌కు సంబంధించి వనపర్తి జిల్లా వ్యాప్తంగా వారం రోజుల్లో వరి కోతలు ప్రారంభం కానున్నాయి. ధాన్యం కొనుగోలు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మరోవారం రోజుల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నారు. ఇప్పటికే కలెక్టర్ ఆదర్శ్ సురభి కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఏప్రిల్ 5వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో కొనుగోలు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

ప్రభుత్వం మద్దతు ధరతో పాటు బోనస్ కూడా అందించనున్నారు. ఈ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 3.40లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యం పెట్టుకున్నారు.



గోపాల్‌పేట మండలం చెన్నూరు సమీపంలో కోత దశలో ఉన్న వరి పైరు

సన్న, దొడ్డు రకం వేరువేరుగా కొనుగోలు

గత వానకాలం సీజన్ నుంచి సన్నరకం ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తుంది. ఈ సీజన్‌లో కూడా సన్న రకానికి బోనస్ ఇస్తుండడంతో సన్న రకం, దొడ్డ రకం ధాన్యాన్ని వేరువేరుగా కొనుగోలు చేసేందుకు అధికారులు ఏర్పాటు చేశారు. వనపర్తి జిల్లా వ్యాప్తంగా 414 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. సన్న రకం కొనుగోలుకు 151, దొడ్డ రకం కొనుగోలు చేసేందుకు 263 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లలో గతంలో ఎదుర్కొన్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈ సీజన్‌లో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నారు. యాసంగి ధాన్యం సేకరణకు 50 లక్షల గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించే వరకు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మరిన్ని గన్నీ బ్యాగులు కూడా తెప్పించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. అదే విధంగా కొనుగోలు కేంద్రాలకు అవసరమైన ప్యాడి క్లీనర్, తేమశాతం కొలిచే యంత్రాలు, ఎలక్ట్రానిక్ కాంటాలు సిద్ధం చేశారు .

మద్దతు ధరకే కొనుగోలు

రాష్ట్ర ప్రభుత్వం గ్రేడ్ ఏ వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,320, బీగ్రేడ్ ధాన్యానికి రూ.2,300 చెల్లించనున్నారు. 17శాతం తేమ ఉన్న వడ్లను మాత్రమే కొనుగోలు చేయనున్నారు. గత వానకాలం సీజన్‌లో జిల్లాలో ఆత్మకూరు, అమరచింత, మదనాపూర్, పెబ్బేరు మండలాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం ఆలస్యం కావడంతో రైతులు దళారులకు ధాన్యం విక్రయించారు. ఈ ఏడాది కోతలకు ముందుగానే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు సిద్ధం అవుతున్నారు. కొనుగోలు చేసిన 24 గంటల్లోనే డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

వారం రోజుల్లో ప్రారంభిస్తాం

యాసంగి సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు వారం రోజుల్లో ప్రారంభిస్తాం. ఇప్పటికే కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సూచనలు చేశారు. కోతలు ప్రారంభం అయిన వెంటనే జిల్లా వ్యాప్తంగా 414 కేంద్రాలను ప్రారంభిస్తాం. కేంద్రాల వద్ద రైతులు ఇబ్బంది పడకుండా సౌకర్యాలు కల్పిస్తున్నాం.

- జగన్మోహన్, జిల్లా సివిల్ సప్లయ్ మేనేజర్

ఒకటో తేదీ నుంచి సన్న బియ్యం

- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం జిల్లా వ్యాప్తంగా ఏప్రిల్ 1వ తేదీ నుంచి రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్లు నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశానుసారం ఒకటో తేదీ నుంచి జిల్లాలోని అన్ని రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులందరికీ సన్నబియ్యం సరఫరా చేసేలా ప్రణాళిక రూపొందించామని, అందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. దీంతో పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్న తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుందిన కలెక్టర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 2,43,107 రేషన్ కార్డుదారులకు లబ్ధి చేకూరుతోందని కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. ప్రభుత్వం అందజేసే సన్న బియ్యాన్ని అర్హులందరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'ఉగాది' సందడి

- జాతరను తలపించిన గద్వాల మార్కెట్



కొనుగోలుదారులతో రద్దీగా ఉన్న గద్వాల కూరగాయల మార్కెట్ సర్కిల్



గద్వాల పట్టణంలో మామిడాకులు కొనుగోలు చేస్తున్న ప్రజలు



గద్వాల పట్టణంలో పూలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

గద్వాల టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని పండుగకు అవసరమయ్యే సరకుల కొనుగోళ్లతో శనివారం జోగుళాంబ గద్వాల పట్టణం సందడిగా మారింది. నేడు విశ్వావసునామ సంవత్సరం సందర్భంగా తోరణాలు కట్టేందుకు కావాల్సిన మామిడాకులు, బంతిపూలు కొనుగోలు చేసేవారితో మార్కెట్ జాతరను తలపించింది. గ్రామీణ ప్రాంతాల్లో పండుగ రోజు రైతులు కొత్త దుస్తులు ధరించి కాడెద్దులకు పూజలు చేయడం, వానకాలం సీజన్‌కు సంబంధించి వ్యవసాయ పనులు ప్రారంభిస్తారు. దీంతో పండుగ సరకులు కొనేందుకు గ్రామీణ ప్రాంత ప్రజలు పెద్ద సంఖ్యలో పట్టణానికి రావడంతో సందడి... సందడిగా మారింది. దీంతో పాటు షడ్రుచుల పచ్చడి తయారు చేసేందుకు కావాల్సిన కిరాణ సరకులు కొనేవారితో దుకాణాలు కిటకిటలాడాయి.

నల్లమల ఘాట్ రోడ్డులో కారు, ఆర్టీసీ బస్సు ఢీ

- ఇద్దరు మృతి, మృతుల్లో ముంబాయి డీసీపీ సుధాకర్ భానుదాస్ పథారే

6

విద్యతోనే అభివృద్ధి

- రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జీ నిరంజన్

అచ్చంపేట,మార్చి 29 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, తమ పిల్లలను ఉన్నత చదవులు చదివించాలని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జీ నిరంజన్ అన్నారు. బీసీ కులాల్లో కొన్ని కులాల పేర్ల మార్పిడిపై అభిప్రాయ సేకరణ, వారీ జీవన స్థితిగతులపై అవగాహన కల్పించేందుకు బీసీ కమిషన్ సభ్యులు శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో బుడుబుక్కల కులస్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి జీవన స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. కులం పేరు మార్పిడి పై సలహాలు తీసుకున్నారు. మెజారిటీ ప్రజలు బుడుబుక్కల కులంగా ఉన్న తమను ఆర్యక్షైత్ర జోషిగా మార్చాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ రాజీవ్ యువవికాసం పథకంలో బుడుబుక్కల కులస్థులకు ప్రాధాన్యత కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ సభ్యు లు జయప్రకాష్, సురేందర్, బాలలక్ష్మి, బీసీ వెల్ఫేర్ అసిస్టెంట్ ఆఫీసర్ శ్రీరామ్, ఆర్డీవో, తహసీల్దార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీ నిరంజన్

తెలుగుభాష గొప్పతనం చాటడం ఆనందదాయకం

▸ సింగపూర్ ఉగాది వేడుకల్లో ఎంపీ డీకే అరుణ


ఉగాది వేడుకల్లో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

మహబూబ్ నగర్ కలెక్టరేట్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషకు ఆదరణ తగ్గుతున్న ఈ రోజుల్లో తెలుగు భాష గొప్పతనం చాటేలా ఇలాంటి ప్రోగ్రాం నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ పేర్కొన్నారు. పంగోలు లోని గిల్స్ ఎంపీహెచ్ ఆడిటోరియంలో సాంస్కృతిక కళాసారధి సింగపూర్ ఆధ్వర్యంలో శుక్రవారం విశ్వావసునామ సంవత్సర ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఈ వేడుకలకు విశిష్ట అతిథిగా హాజరై మాట్లాడారు. అంతకుముందు ఆమెను సింగపూర్ సాంస్కృతిక కళాసారథి సభ్యులు సాదరంగా స్వాగతించి సన్మానించారు.

పిల్లలు ఇంగ్లీష్‌లో మాట్లాడటం సంతోషం అనిపించినప్పటికీ తెలుగు భాష గొప్పతనాన్ని నేర్పించలేక పోతున్నామని పేర్కొన్నారు. మన ధర్మం, మన కట్టుబాట్లు మన భావి తరాలకు మనమే నేర్పించాలని అన్నారు. తెలుగు కొత్త సంవత్సరం ఈ ఉగాది నుంచే ప్రారంభం అవుతుందని, ఈ సందర్భంగా తెలు గు ప్రజలందరికీ ఆమె ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు.

డాక్టర్ నితీషా టీనాకు తెలంగాణ డాక్టర్స్ ఎక్సలెన్స్ అవార్డు

▸ ఫెర్టిలిటీ విభాగంలో ఉమ్మడి జిల్లా నుంచి ఎంపికైన ఒకే ఒక్క డాక్టర్


డాక్టర్ నితీషను సన్మానిస్తున్న డాక్టర్ వివేక్ సాగర్, డాక్టర్ సుహాసిని

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం శ్యామ్యూల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలోని టీనా ఇన్‌ఫర్టిలిటీ సెంటర్ డాక్టర్ నితీషా టీనాకు అరుదైన పురస్కారాన్ని అందించింది. ఫర్టిలిటీ విభాగంలో తెలంగాణ డాక్టర్స్ ఎక్సలెన్స్ అవార్డును శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఎంపీ రఘునందన్‌రావు, మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారదల చేతుల మీదుగా ఆమె అందుకున్నారు.

ఉమ్మడి జిల్లా నుంచి ఎంపికైన ఒకే ఒక్క గైనిక్ డాక్టర్‌గా పేరు సంపాదించారు. ఈ మేరకు ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమెతో పాటు గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ వివేక్ సాగర్‌లు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఇన్‌ఫర్టిలిటీ సమస్యగా మారిందని, ఆలస్యంగా పెళ్లిళ్లు చేసుకోవడం, మానసిక ఒత్తిడులు, జీవన విధానంలో మార్పుల కారణంగా సంతానోత్పత్తి కలగడం లేదన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఫర్టిలిటీలో ఫెలోషిప్ చేసి ఉమ్మడి జిల్లా ప్రజలకు సంతాన సాఫల్యత సేవలను అందిస్తున్నానని తెలిపారు.

అయితే తెలంగాణ ప్రభుత్వం ప్రతి ఏడాది నిర్వహించే ఈ తెలంగాణ డాక్టర్స్ ఎక్సలెన్స్ అవార్డు ప్రదానోత్సవంలో వీటన్నింటిని పరిగణలోకి తీసుకొని ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉత్తమ సేవలందిస్తున్న తమ టీనా ఫర్టిలిటీ సెంటర్ డాక్టర్ నితీషాను ఎంపిక చేయడం గర్వకారణమని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో ఉమ్మడి జిల్లా ప్రజలకు సంతాన లేమి సమస్య లేకుండా చేయడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని వెల్లడించారు. ఈ సమావేశంలో ప్రముఖ గైనిక్ డాక్టర్ సుహాసిని, శ్యామ్యూల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లెవలింగ్ పనుల పరిశీలన


పునరావాసం ప్లాట్ల లెవలింగ్ పనులను పరిశీలిస్తున్న ఆర్డీవో అనిల్‌కుమార్, జడ్చర్ల తహసీల్దార్ నర్సింగ్‌రావు

జడ్చర్ల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మండలం దేవునిగుట్టతండా సమీపంలో పునరావాసం కల్పించే ప్లాట్ల వద్ద లెవలింగ్ పనులను శనివారం ఆర్డీవో అనిల్‌కుమార్, తహసీల్దార్ నర్సింగ్‌రావు పరిశీలించారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో ముంపునకు గురవుతున్న రెండు గ్రామ పంచాయతీలతో పాటు ఐదు తండాలలోని ముంపు గ్రామాలకు దేవునిగుట్టతండా సమీపంలో పునరావాసం ఏర్పాట్లు చేపట్టారు. తుమ్మలకుంటతండా ముంపువాసులకు కేటాయించే పునరావాసం ప్లాట్ల వద్ద లెవలింగ్ పనులను పరిశీలించి, పనులను త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు. పునరావాసం కోసం సేకరించిన భూములకు సంబంధించి పరిహారం రాలేదంటూ భూమి యజమానులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

'సాహిత్యాన్ని కాపాడుకోవాలి'

జడ్చర్ల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : సాహి త్యాన్ని సజీవంగా ఉంచేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర సంగీత, నాటక అకాడమీ మాజీ ఛైర్మన్ బాదిమి శివకుమార్ పిలుపు నిచ్చారు. జడ్చర్ల పట్టణంలోని ప్రేమ్‌రంగా గార్డెన్స్‌లో శనివారం జాతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో చైతన్యం తీసుకువచ్చేం దుకు రచయితలు, కళాకారుల పాత్ర కీలకమన్నారు. జాతీయవాద కవిత్వం రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని, సమాజ హితాన్ని కాంక్షిం చేంది సాహిత్యమేనని ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రొద్దుటూరి ఎల్లారెడ్డి అన్నారు. కవులు, కళాకారులు యాదగిరి, జానకిరాములుగౌడ్, ఓర్సునరేశ్‌లకు ఉగాది పుర స్కారాలను అందచేశారు. పద్మలీల, కిరణ్మయి, మహేశ్వర్, కుంచకూరి బుచ్చిలింగం, సాకేత్‌ప్ర వీణ్, వెంకటరమణాచార్యులు, దత్తుకుమార్, రాఘవేందర్‌చారి, అయ్యన్న, పాలాది రాంమో హన్, భాస్కర్, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

స్నేహితుడే.. సూత్రధారి

▸ దారిదోపిడీ చేసి పట్టుబడిన దొంగల ముఠా

▸ కేసును ఛేదించిన పోలీసులు

▸ ఐదుగురి అరెస్టు ... ఐఫోన్, రూ.1,500 నగదు స్వాధీనం

వనపర్తి క్రైమ్, మార్చి29(ఆంధ్రజ్యోతి): వారిద్దరూ స్నేహితులు.. ఒక పని నిమిత్తం ఓ వ్యక్తి తన స్నేహితుడిని నమ్మి కారు తీసుకుని వెంటబెట్టుకుని వెళ్లాడు. పని ముగించుకుని తిరిగి తన స్వగ్రామానికి చేరుకునే క్రమంలో తన స్నేహితుడి దగ్గర ఉన్న ఐఫోన్‌తో పాటు నగదుపై వెంట వెళ్లిన స్నేహితుడి కన్ను పడింది. వెంటనే స్నేహితుడు తన మామకు ఈ విషయాన్ని ఫోన్ చేసి చెప్పి దారి దోపిడీ చేయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులకు దర్యాప్తులో తన స్నేహితుడే ఈ ప్రణాళిక రూపొందించాడని తెలవడంతో షాక్‌కు గురయ్యాడు. ఈ ఘటన వనపర్తి జిల్లాలో చోటు చేసుకుంది. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను ఎస్పీ రావుల గిరిధర్ శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వెల్లడిం చారు.

ఎస్పీ తెలిపిన వివరాల మేరకు... గద్వాల జిల్లా కేంద్రానికి చెందిన షేక్ అహ్మద్ అనే వ్యక్తి తన సొంత తమ్ముడు కారు డ్రైవర్ ఇర్ఫాన్ ఇంట్లో ఎవరికీ చెప్పకుండా రూ.80వేలు తీసుకుని విజయవాడ వెళ్లాడు. ఆ డబ్బుతో అతను ఐఫోన్ కొన్నాడు. ఈనెల 26వ తేదీన విజయవాడ రైల్వే స్టేషన్ పోలీసులు అతని అన్న అబ్దుల్‌కు ఫోన్ చేసి ఇర్ఫాన్ గురించి సమాచారం ఇచ్చారు. అది తెలిసిన అతని అమ్మ వెంటనే మిర్యాలగూడలో ఉంటున్న అతని మామతో ఫోన్‌లో మాట్లాడి ఇర్ఫాన్‌ను తీసుకురమ్మని చెప్పింది. అతని మామ నవాజ్ విజయవాడకు వెళ్లి ఇర్ఫాన్‌ను తీసుకుని వస్తానని చెప్పాడు. ఇర్ఫాన్‌ను తీసుకు రమ్మని షేక్ అహ్మద్‌కు తన మేనమామ నవాజ్ చెప్పాడు. వెంటనే షేక్ అహ్మద్ తన స్నేహితుడైన రామాంజనేయులును వెంటబెట్టుకుని కారు అద్దెకు తీసుకుని 26వ తేదీన వెళ్లి అదే రోజు ఇర్ఫాన్‌ను మిర్యాలగూడలోని తన మేనమామ దగ్గర ఉంచి వస్తున్నారు. ఇర్ఫాన్ కొనుగోలు చేసిన ఐఫోన్‌ను షేక్ అహ్మద్ అతనికి ఇవ్వకుండా తన వెంట తీసుకుని స్వగ్రామమైన గద్వాలకు బయలుదేరారు. ఈ ఐఫోన్‌పై వెంటవెళ్లిన స్నేహితుడైన రామాంజనేయులు కన్నుపడింది.

ఈ విషయాన్ని తన మేనమామ అయిన గోపాల్‌పేట మండలం బుద్దారం గ్రామానికి చెందిన రాజేష్‌కు ఫోన్ చేసి రామాంజనేయులు చెప్పాడు. వారు ఎక్కడెక్కడ వస్తున్న సమాచారాన్ని రామాంజనేయులు తన మేనమామకు సమాచారం ఇస్తూ వచ్చాడు. ఈ క్రమంలో 27వ తేదీ తెల్లవారు జామున గద్వాలకు వస్తున్న క్రమంలో బుద్దారం గ్రామానికి సమీపంలో రాగానే ముందే పథకం ప్రకారం రాజేష్ మరో ముగ్గురు తన స్నేహితులు విజయ్ కుమార్, మహమ్మద్ సల్మాన్, అశోక్‌లకు ఈ విషయాన్ని వారికి చెప్పాడు. వారు కూడా అందుకు ఒప్పుకు న్నారు. ఆ ముగ్గురు ఒక స్కూటీపై బుద్దారం దాటిన తరువాత బిజినపల్లి వైపు నుంచి రామాం జనేయులు షేక్ అహ్మద్ వస్తున్న కారును అడ్డ గించి అతడిపై దాడి చేశాడు. అతని వద్ద ఉన్న ఐఫోన్ సీల్డ్ బాక్సు రూ.1500 నగదును దొంగిలిం చారు. దాంతో పాటు బాధితుడికి అనుమానం రాకుండా రామాంజనేయులు మొబైల్ ఫోన్ కూడా తీసుకువెళ్లారు.

ఈ విషయంపై బాధితుడు గోపాల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి ఐఫోన్ రూ. 1500 నగదు, నేరానికి ఉపయోగించిన స్కూటీ, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. తోటి స్నేహితుడే ఈ పథకాన్ని రూపొం దించి దారి దోపిడీకి ప్రణాళిక రూపొందించి దొరికి పోయాడని ఎస్పీ తెలిపారు. కేసును చాకచక్యం గా ఛేదించిన వనపర్తి సీఐ కృష్ణయ్య, గోపాల్‌పేట ఎస్ఐ నరేష్, సీసీఎస్ ఎస్ఐ రామరాజు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ రెడ్డి, నగేష్, కానిస్టేబుల్స్ శ్రీనివాస్, ఆంజనేయులు మౌలానా, మురళిలను ఎస్పీ అభినందించి రివార్డులను అందజేశారు. డీఎస్పీ వెంకటేశ్వరరావు డీసీఆర్బీ ఇన్‌చార్జి అదనపు ఎస్పీ ఉమామహేశ్వరరావు, సీఐ కృష్ణయ్య, ఎస్ఐలు నరేష్, రామరాజు పాల్గొన్నారు.

హత్య కేసులో వ్యక్తి రిమాండ్


మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగర్జున గౌడ్

బాలానగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): బాలానగర్ మండల కేంద్రానికి చెందిన మహ్మద్ జాంగీర్ ఈ నెల 27వ తేదీన అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి సమగ్ర విచారణ నిర్వహించగా, వివాహేతర సంబంధం నేపథ్యంలో మృతి చెందినట్లు వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మహ్మద్ జాంగీర్‌కు మూడవత్ చక్రితో గత 8సంవత్సరాలుగా వివాహేతర సంబంధం కలిగి ఉన్నారని వివరించారు. వీరిద్దరిని భర్త సక్రి పలుమార్లు మందలించారు. అయినా వీరిద్దరు వారి సంబంధాన్ని అలాగే కొనసాగించారని తెలిపారు.

ఈ నెల 26న సాయంత్రం సమయంలో సక్రి కుమారుడు సిద్దార్థ ఇంటికి రాగా ఇంట్లో అమ్మ కనిపించలేదు. అమ్మ ఎక్కడా అని సిద్దార్థ చెల్లెలును ప్రశ్నించడంతో చెల్లెలు ఇంటి వెనకాల ఉన్న చెరువు కట్టపైకి వెళ్లిందని తెలిపింది. సిద్దార్థ అక్కడికి వెళ్లి చూడగా తల్లి, జాంగీర్‌లు మద్యం తాగుతూ కనిపించారు. ఆగ్రహంతో సిద్దార్థ తల్లి సక్రిపై, జాంగీర్‌పై కర్రతో దాడి చేశాడు. జాంగీర్ స్పృహ తప్పి పడిపోయాడు. స్పృహ నుంచి కోలుకున్న జాంగీర్ సాయంత్రం ఇంటికి వెళ్లాడు. జరిగిన విషయం కుటుంబ సభ్యులకు వివరించారు. వారు చికిత్స నిమిత్తం ఓ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ 27వ తేదీ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సిద్దార్థ హైదరాబాద్ పారిపోయాడు. పోలీసులు సిద్దార్థను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నాగర్జున గౌడ్, ఎస్సై లెనిన్, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యానికి గురై చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చి చికిత్స చేయించుకుని తల్లిదండ్రులకు చెప్పకుండా మనీషా(19) అదృశ్యమైనట్లు ఎస్ఐ గోవర్ధన్ శనివారం తెలిపారు. వివరాల ప్రకారం.. తెలకపల్లి మండలం గౌతంలపల్లికి చెందిన దాదిమల్ల మనీషా(19) జిల్లా కేంద్రంలో కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతుంది. గత పది రోజుల కిందట అనారోగ్యానికి గురి కావడంతో జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స కోసం వచ్చారు. అక్కడ చికిత్స పొందుతూ మార్చి 27న తల్లిదండ్రులు మందులు తేవడానికి వెళ్లి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. ఈ సంఘటనపై చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో యువతి తండ్రి దాదిమల్ల శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు.

ఎల్ఆర్ఎస్, పన్నుల చెల్లింపుల కోసం జనం ఆరాటం

▸ నేడు, రేపు సెలవు రోజుల్లో సైతం ప్రత్యేక కౌంటర్

నారాయణపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మార్చి నెలాఖరులోపు ఎల్ఆర్ఎస్ 25 శాతం రాయితీ, పన్నులపై వడ్డీ 90 శాతం మాఫీతో నారాయణపేట మునిసిపాలిటీలో శనివారం ఎల్ఆర్ఎస్, పన్నుల చెల్లింపుల కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజల రద్దీ కానవచ్చింది. అయితే ఉగాది, రంజాన్ పండుగల దృష్ట్యా సెలవు రోజులైన ఆది, సోమవారాల్లో సైతం మునిసిపాలిటీలో ప్రత్యేక కౌంటర్ తెరిచి ఉంటుందని, సిబ్బంది విధుల్లో ఉంటారని పట్టణ ప్రజలు పన్నులు చెల్లించి తమ వంతు సహకారం అందించాలని కమిషనర్ భోగేశ్వర్లు కోరారు.


పేట మునిసిపాలిటీలో పన్నులు చెల్లించేందుకు వచ్చిన జనం

ముస్లింల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి

▸ ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు


పెద్దకొత్తపల్లిలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు

పెద్దకొత్తపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మైనార్టీల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. శనివారం రాత్రి మండల కేంద్రంలోని మసీద్‌లో ముస్లింలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలను మంత్రి జూపల్లి, మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్‌లు తెలిపారు. ముస్లింలకు స్థానిక పీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలనలో అన్ని చర్యలను చేపట్టిన విషయాలను వివరించారు. ఈ సందర్భంగా మంత్రితో పాటు మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ దండు నరసింహను మస్జిద్ కమిటీ సభ్యులు పూలమాలలతో సన్మానించారు. అంతకు ముందు హైవే రోడ్డు విస్తరణలో కూల్చివేతకు గురి కానుండటంతో కొత్తగా పునర్నిర్మాణం చేస్తున్న మసీద్ నిర్మాణం పనులను మంత్రి పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రావు, మాజీ ఎంపీటీసీలు దండు నరసింహ, రవికుమార్, బద్యనాయక్, సింగిల్ విండో ఛైర్మన్లు బాలస్వామి, గోపాల్‌రావు, జిల్లా గ్రంథా లయ మాజీ ఛైర్మన్ నాగపూర్ విష్ణు, సర్పంచ్‌లు సత్యం, చిన్న య్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు టి.కృష్ణయ్య, విండో డైరెక్టర్ దండు చంద్రయ్య, కాంగ్రెస్‌పార్టీ మండల నాయకులు గోపాల్‌రావు, చిత్రనాథ్, గుమ్మకొండ రమేష్, బత్తుల కుర్మయ్య, హబీబ్, రవీందర్‌రెడ్డి, మల్లేష్, భయ్యా రాముడు, నాగరాజు, వి.శ్రీనివాసులు, పుట్ట ఆంజనేయులు, మిద్దె శివయ్య, మల్లయ్య, కార్యకర్తలు సీనియర్ నాయకులు మైనార్టీ నాయకులు ఎండి.బాలపీరు, మైనోద్దీన్, ఖాజా, సుల్తాన్‌బాబు మియా తదితరులు పాల్గొన్నారు.

నల్లమల ఘాట్ రోడ్డులో కారు, ఆర్టీసీ బస్సు ఢీ

▸ ఇద్దరు మృతి, మృతుల్లో ముంబై డీసీపీ సుధాకర్ భానుదాస్ పథారే


మృతి చెందిన డీసీపీ సుధాకర్ భానుదాస్ పథారే (ఫైల్)

దోమలపెంట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : నల్లమల ఘాట్ రోడ్డులో ఆర్టీసీ బస్సు, కారు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో మహారాష్ట్రకు చెందిన ఇద్దరు మృతి చెందారు. ఈగలపెంట ఎస్సై వీరమల్లు తెలిపిన వివరాల ప్రకారం నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం దోమలపెంట ఆక్టోపస్ వ్యూ పాయింట్ సమీపంలో శనివారం శ్రీశైలం నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న బీహెచ్ఈఎల్ డిపోకు చెందిన ఆర్టీసి బస్సును హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళుతున్న ఇన్నోవా కారు ఎదురుగా ఢీకొన్నది. కారులో ప్రయాణిస్తున్న ముంబాయి సిటీ కమిషనరేట్‌లోని పోర్ట్‌జోన్ డీసీపీ డాక్టర్ సుధాకర్ భానుదాస్ పథారే (54), మహారాష్ట్రకు చెందిన కాం ట్రాక్టర్ భగవత్ కిషన్‌రావు కోడ్కే పాటిల్ (66) తీవ్రం గా గాయపడ్డారు. వారిని వెంటనే ప్రైవేట్ అంబులెన్స్‌లో వెల్దండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో మృతదేహాలను పోస్టుమార్టం కోసం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మహారాష్ట్రలోని మృతుల బంధువులకు పోలీసులు సమాచారం ఇచ్చారు. మృతదేహాలను నాగర్‌కర్నూలు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ పరిశీలించారు.


నల్లమల ఘాట్ రోడ్డులో జరిగిన ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

పవిత్ర ఖురాన్ బోధనలు ఆచరణీయం

▸ ఇఫ్తార్ విందులో నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ముస్లింలకు పవిత్రమైన ఖురాన్‌లో మహ్మద్ ప్రవక్త బోధనలు ఆచరణీయమని నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని రూబీ గార్డెన్‌లో మాజీ ఎమ్మెల్యే మర్రి ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. మజీద్ ఇమామ్, మౌజన్‌లను శాలువాలు, పూలమాల లతో మాజీ ఎమ్మెల్యే ఘనంగా సత్కరించి, ఒక్కొక్కరికి రూ.2500 చొప్పున తోఫాలను అంద జేశారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు మహ్మద్ సాదిక్ పాషా, షేక్ యాకుబ్, బావజీర్, షేక్ ఫరీద్ అహ్మద్, సయ్యద్ రఫియోద్దీన్, కొట్టం దర్గా ముతవల్లి ఖాజాబాబా, ఇమామ్ అబ్దుల్ హక్, మాజీ కౌన్సిలర్ షాజహాన్, మాజీ కోఆప్షన్ సభ్యుడు ముస్తాక్, జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ ఛైర్మన్ హనుమంతరావు, మాజీ మునిసిపల్ వైస్ ఛైర్మన్ బాబురావు, బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు షఫీ ఉల్లాఖాన్, మహ్మద్ నేహాల్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు వార్డులకు ఒక ఇన్‌చార్జి

▸ నగరంలో జైబాపు, జైభీమ్ కార్యక్రమాలు విజయవంతం చేద్దాం

▸ తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్


సమావేశంలో మాట్లాడుతున్న ముడా ఛైర్మన్ లక్ష్మణ్‌యాదవ్

మహబూబ్‌నగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ఏఐసీసీ ఆదేశాల మేరకు దేశ వ్యాప్తంగా జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమాలు చేపడుతోందని ఇందులో భాగంగానే నగరంలో ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. పాలమూరు నగరంలో ఐదు వార్డులకు ఒక ఇన్‌చార్జిని నియమించి, ఆ ఇన్‌చార్జి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముడా ఛైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మాజీ మునిసిపల్ ఛైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్‌తో కలిసి నగర కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమాలకు నాయకులు, కార్యకర్తలు సహకరించాలని కోరారు. మహాత్మాగాంధీ ఏఐసీసీ అధ్యక్షుడుగా ఎన్నికై వందేళ్లు, భారత రాజ్యాంగం రచించి 75 సంవత్సరాలు అవుతున్న నేపథ్యంలో మహాత్మాగాంధీ, అంబేడ్కర్ సిద్ధాంతాలు, రాజ్యాంగ విలువలు కాపాడేందుకు ఈ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు జహీర్‌అక్తర్, ఎన్‌పీ వెంకటేశ్, సిరాజ్‌ఖాద్రి, సీజె బెనహర్, అవేజ్, బెక్కరి మధుసూదన్‌రెడ్డి, సాయిబాబ, ఫయాజ్, రాములుయాదవ్, అజ్మత్‌అలీ పాల్గొన్నారు.

తెలంగాణ ఉన్నంత వరకు దాశరథి పేరు ఉంటుంది

▸ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి


దాశరథి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, దేశపతి శ్రీనివాస్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తదితరులు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉన్నంత వరకు దాశరథి కృష్ణమాచార్యుల పేరు ఉంటుందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. వ్యవస్థతో, రాజ్యంతో రాజీ పడకుండా ఆయన రచనలు చేశారని పేర్కొన్నారు. శనివారం దాశరథి కృష్ణమాచార్యుల శత జయంతి వేడుకలను సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ... దాశరథి కృష్ణమాచార్యులు అతి తక్కువ సమయంలో ఎక్కువ ప్రభావవంతమైన రచనలు చేశారన్నారు. 50 సంవత్సరాల సాహిత్య కాలంలో ఆయన చేపట్టని సాహిత్య ప్రక్రియ లేదన్నారు. భక్తి, శృంగార, సందేశం ఇచ్చే ఎన్నో వైవిధ్యమైన పాటలు రచించారన్నారు. ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీలో ఆయన పని చేశారని గుర్తు చేశారు. మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం దాశరథికి నిజమైన నివాళులర్పించిందని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, నాయకులు వాకిటి శ్రీధర్, పలుస రమేష్ గౌడ్, నందిమల్ల అశోక్, సాహితి కళావేదిక జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్, బైరోజు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వాటర్ లైన్‌మన్ మృతి


ఎన్నం సత్తయ్య(ఫైల్)

భూత్పూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మునిసిపాలిటీలో వాటర్ లైన్‌మన్‌గా పనిచేస్తున్న వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని తాటికొండ గ్రామ శివారులో ఉన్న 44వ జాతీయ రహదారి పై చోటు చేసుకుంది. ఎస్ఐ చంద్రశేఖర్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ పట్టణ కేంద్రంలోని టీడీగుట్ట ప్రాంతానికి చెందిన ఎన్నం సత్తయ్య(61) మునిసిపాలిటీలో వాటర్ లైన్‌మన్‌గా పనిచేస్తున్నాడు. అయితే శనివారం అమావాస్య కావడంతో మూసాపేట మండలంలోని కందూరు రామలింగేశ్వరస్వామి దర్శనం కోసం తన స్కూటీ వాహనంలో బయలుదేరాడు. భూత్పూర్ మండలంలోని తాటికొండ గ్రామ శివారులోకి రాగానే వెనుకాల నుంచి కారు స్కూటీ వాహనాన్ని ఢీకొన్నది. ఈ సంఘటనలో ఎన్నం సత్తయ్య(61) అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని కుమారుడు ఎన్నం మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

ఇసుక టిప్పర్ పట్టివేత: కేసు నమోదు


పట్టుబడిన ఇసుక టిప్పర్

ఊర్కొండ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలో శనివారం చోటుచేకుంది. ఎస్సై కృష్ణదేవ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం అల్వాన్‌పల్లి గ్రామ శివారులోని వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం నర్సంపల్లి గ్రామానికి ఇసుకను తరలిస్తుండగా శనివారం తెల్లవారుజామున పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు నర్సంపల్లి వద్ద పట్టుకొని పోలీస్‌స్టేషన్ తరలించారు. అనంతరం మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలానికి చెందిన టిప్పర్ డ్రైవర్ కొత్తచెన్నయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

ఇసుక అక్రమ రవాణా

» టిప్పర్లను అడ్డుకున్న బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు


తహసీల్దార్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్, బీజేపీ నాయకులు

మిడ్జిల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని అయ్యవారిపల్లి శివారులోని దుందుభీవాగు పరివాహక ప్రాంతంలో టీఎస్ఎండీసీ ద్వారా సీజ్ చేసిన ఇసుకను బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నాయకులు రైతులతో కలిసి అడ్డుకున్నారు. ఇసుకను తరలించే టిప్పర్లను రాణిపేట గ్రామ శివారులోని జాతీయ రహదారిపై శనివారం పట్టుకున్నారు. అధికారులు అక్రమార్కులకు జీరో వేబిల్లుపై పంపిస్తూ ఇసుక అక్రమ రవాణా చేసే వారితో కుమ్మక్కయ్యారని ఆరోపించారు.

పెద్ద ఎత్తున రోడ్డుపై టిప్పర్లను ఆపడంతో రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో గుమికూడి తహసీల్దార్ రాజుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తహసీల్దార్ అధికారుల పార్టీ నాయకుల కనుసన్నల్లో విధులు నిర్వహిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తహసీల్దార్ రాజును సస్పెండ్ చేయాలని, లేకుంటే ఇక్కడి నుంచి కదిలేది లేదని పట్టుబట్టారు. విషయం తెలుసుకున్న ఎస్సై శివనాగేశ్వర్‌నాయుడు టిప్పర్ల వద్దకు వెళ్లి నచ్చజెప్పేందుకు ప్రయత్నించిన వారు వినకపోవడంతో నేరుగా తహసీల్దార్ టిప్పర్ల వద్దకు రావడంతో ఒక్కసారిగా రైతులు, నాయకులు తహసీల్దార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక టిప్పర్లపై కేసులు నమోదు చేసి చర్యలు చేపట్టాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. మాజీ ఎంపీపీ బరిగెల సుదర్శన్, మాజీ జడ్పీటీసీ శశిరేఖబాలు, బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి రాజేశ్వర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి, ఆయా పార్టీల నాయకులు పాండు, కాడయ్య, జైపాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మంద భీంరాజు, సురేష్, నవీన్ చారీ, ప్రతాప్‌రెడ్డి, జంగారెడ్డి, నరేష్‌నాయక్, హుస్సేన్, మాసయ్యలతో పాటు తదితరులున్నారు.


వాడియాల గ్రామ శివారులోని వెంచర్‌లో ఇసుకను ఖాళీ చేస్తున్న టిప్పర్

» డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందుల విక్రయాలు
» ఫోన్‌లో, నేరుగా అడిగినా మందులు ఇస్తున్న దుకాణాదారులు
» ఇటీవల ఇంజక్షన్ వికటించి ప్రాణాలు కోల్పోయిన యువకుడు?

చీటీ లేకున్నా ఓకే!


జనరల్ ఆసుపత్రి ఎదుట ఔషధ దుకాణాలు

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : జ్వరం, దగ్గు, జలుబు, తలనొప్పి... ఇలా ఏ జబ్బు వచ్చినా, డాక్టర్ వద్దకు వెళ్లి చూపించుకొని మందులు వాడాల్సి ఉంటుంది. కానీ మహబూబ్‌నగర్ జిల్లాలో పరిస్థితి భిన్నంగా ఉంది. ఏ జబ్బు వచ్చినా, వైద్యుడి వద్దకు వెళ్లకుండా నేరుగా మెడికల్ దుకాణాలకు వెళ్తున్నారు. వారు కూడా డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే వారు చెప్పిన వ్యాధి లక్షణాలను బట్టి మందులు ఇస్తున్నారు. అంతేకాకుండా ఫోన్‌లో చెప్పినా మందులు ఇచ్చేస్తున్నారు. ఇదే తరహాలో తాజాగా జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి బంధువులు మెడికల్ దుకాణానికి వచ్చి ఫోన్ మాట్లాడించి మందులు తీసుకెళారు. అయితే ఒక ఇంజక్షన్‌కు బదులు మరో ఇంజక్షన్ ఇచ్చారు. దీంతో చికిత్స పొందుతున్న యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఇలా మెడికల్ షాపుల్లో సాధారణ మందులతో పాటు డాక్టర్ సలహా మేరకు వాడాల్సిన యాంటి బయోటిక్స్, నొప్పుల ఇంజక్షన్లు, నిద్ర మాత్రలను కూడా డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే ఇచ్చేస్తున్నారు. వాస్తవానికి డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా ఒక్క మందు కూడా బాధితులకు ఇవ్వొద్దనే నిబంధనలు ఉన్నాయి. కానీ వాటిని ఏ ఒక్క మెడికల్ దుకాణంలోనూ అమలు చేయడం లేదు. దీంతో జిల్లాలో మెడికల్ షాపులు పుట్టగొడుగుల్లాగా పుట్టుకొస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇదే తరహాలో మెడికల్ దందా కొనసాగుతోంది.

ఫార్మసిస్టులు లేకుండానే...

ప్రస్తుతం మహబూబ్‌నగర్ జిల్లాలో 200కు పైగా హోల్‌సేల్, 400కు పైగా రిటైల్ మెడికల్ దుకాణాలు ఉన్నాయి. అందులో అర్హత లేకున్నా ఫార్మసీలు నిర్వహిస్తున్న వారు చాలా మంది ఉన్నారు. వాస్తవానికి మెడికల్ షాపు నిర్వహించాలంటే బీ-ఫార్మసీ, ఎం-ఫార్మసీ, డీ-ఫార్మసీ విద్యార్హత తప్పనిసరి. కానీ ఎలాంటి అర్హతలూ లేని వారు కూడా మెడికల్ దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. అంతే కాకుండా కొన్ని దుకాణాల్లో పేరుకు మాత్రమే ఫార్మసీ సర్టిఫికెట్ ఉంటోంది. కానీ బినామీ పేర్లతో దుకాణాలను కొనసాగిస్తున్నారు. అలాగే ఫార్మసీ పూర్తి చేసిన వారే మెడికల్ దుకాణాల్లో పని చేయాల్సి ఉంటుంది. కానీ ఆ పరిస్థితి కనిపించడం లేదు. మెడికల్ షాపుల్లో, హాస్పిటళ్లలో పని చేసి కొంత అనుభవం సంపాదించుకున్న వారు ఫార్మసిస్టులుగా చెలామణి అవుతున్నట్లు ఆరోపణలున్నాయి. దీంతో ఒక్కోసారి వారు డాక్టరు రాసిన చిట్టీలోని పేర్లను సరిగా అర్థం చేసుకోకుండా మందులు ఇచ్చేస్తుండటం సమస్యగా మారుతోంది.

ఇంజక్షన్ వికటించి యువకుడి మృతి?

ఇటీవల జడ్చర్ల మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు అతడిని జనరల్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 20న ఆ యువకుడు మృతి చెందాడు. దీనిపై పోలీసులు విచారణ చేపట్టగా పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. రోగిని చూసిన తర్వాత డాక్టర్ కేస్ షీట్‌లో మందులు రాసి వెళ్లిపోయాడు. ఆ తర్వాత రోగి బంధువులు కేస్ షీట్‌లో ఉన్న మందుల పేపర్‌ను ఫొటో తీసుకొని వెళ్లి ఆసుపత్రి ఎదుట ఉన్న ఓ మెడికల్ షాపు వద్దకు వెళ్లారు. అయితే ఫోన్‌లో ఉన్న ఫొటో సరిగ్గా లేకపోవడంతో, రోగి వద్ద ఉన్న మరో బంధువుకు ఫోన్ చేసి చూపించారు. కానీ మెడికల్ షాపులో పనిచేసే వ్యక్తి అవేవీ చూడకుండా ఒక ఇంజక్షన్‌కు బదులు మత్తు ఇంజక్షన్ ఇచ్చాడు. దాన్ని తీసుకెళ్లి నర్సింగ్ సిబ్బందికి ఇచ్చామని, వారు ఇంజక్షన్ ఇవ్వడం వలన చనిపోయాడని మృతుడి బంధువులు ఆరోపించారు. కానీ తాము మందులను బయటకు రాసివ్వలేదని, కేస్‌షీట్‌లో ఉన్న మందులు తమ వద్దనే ఉన్నాయని, వాటినే నర్సింగ్ వాళ్లు ఇచ్చారని వైద్యులు చెప్తున్నారు. అయితే పోస్టుమార్టం నివేదిక వస్తే వాస్తవం వెల్లడి కానున్నది. ఇంజక్షన్ వల్లే చనిపోయాడా? ఇతర కారణాలతో చనిపోయాడా అన్నది తేలనున్నది. పోలీసుల విచారణలో కూడా చిటీ లేకుండా మందులు తీసుకొచ్చాడని తేలింది. ఏది ఏమైనా ఓ నిండు ప్రాణం బలయ్యింది.


మెడికల్ షాపులో మందులు ఇస్తున్న ఫార్మసీ చదవని వ్యక్తి

నిద్రమత్తులో ఔషధ నియంత్రణ శాఖ

జిల్లాలో మెడికల్ దందా విచ్చలవిడిగా కొనసాగుతోంది. ఫార్మసీ సర్టిఫికెట్ లేని వాళ్లు సైతం ఫార్మసిస్టులుగా చలామణి అవుతూ మెడికల్ షాపులు నిర్వహిస్తున్నారు. అందులో పనిచేసే వారికి ఒక్కరికి కూడా ఫార్మసీ సర్టిఫికెట్‌లు లేవు. దీంతో ఒకదానికి బదులు మరో మందు ఇచ్చి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా చాలా చోట్ల ఈ దందా కొనసాగడంతో పాటు ఇంజక్షన్, మందులు వికటించి ప్రాణాలు వదులుతున్న సంఘటనలు జిల్లాలో చోటుచేసుకుంటున్నాయి. కానీ జిల్లాలో ఉన్న ఔషధ నియంత్రణ శాఖ అధికారులు నిద్రమత్తులో తేలుతున్నారు. ఇప్పటి వరకు వందలోపే ఆసుపత్రులు, మెడికల్ దుకాణాలలో తనిఖీలు చేశారు. అయితే ఔషధ నియంత్రణ శాఖ అధికారులు తనిఖీలకు వచ్చినపుడు, నెలనెల మామూళ్లు తీసుకొని కిమ్మనడం లేదనే ఆరోపణలు బాహాటంగానే వినిపిస్తున్నాయి. ఇది ఇలాగే కొనసాగితే మెడికల్ మాఫియాకు మరింతమంది బలయ్యే ప్రమాదం లేకపోలేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

షోకాజ్ నోటీసులు జారీ చేశాం...



జనరల్ ఆసుపత్రిలో జరిగిన సంఘటన విషయం నా దృష్టికి వచ్చింది. నేనే స్వయంగా వెళ్లి ఆసుపత్రి ఎదుట ఉన్న ప్రైవేటు మెడికల్ దుకాణాలలో తనిఖీలు చేశాను. కొన్ని లోపాలను గుర్తించాం. దీనిపై వారికి షోకాజ్ నోటీసులు కూడా జారీ చేశాం. అవి రుజువైతే ఆయా మెడికల్ దుకాణ యాజమాన్యంపై చర్యలు తీసుకుంటాం. అదేవిధంగా డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు ఇవ్వడం నిబంధనలకు విరుద్ధం. ఫార్మసిస్టులు లేకుండా మెడికల్ దుకాణాలు నడిపితే వారిపై కూడా చర్యలు తీసుకుంటాం.

- దినేష్‌కుమార్, ఉమ్మడి జిల్లా ఆహార కల్తీ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్

ప్రశాంతంగా ముగిసిన బయోసైన్స్ పరీక్ష

నాగర్‌కర్నూల్ టౌన్/గద్వాల సర్కిల్/నారాయణపేట/వనపర్తి విద్యావిభాగం /మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్షల్లో శనివారం నిర్వహించిన బయోసైన్స్ పరీక్ష జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో మొత్తం 10,584 మంది విద్యార్థులకు గాను 10,559 మంది హాజరయ్యారు. జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ బిజినేపల్లి మండల కేంద్రంలోని బాలుర, బాలికల పాఠశాలతో పాటు ఆల్ సేయింట్స్ హైస్కూల్, పాలెం పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. అంతకుముందు ఉదయం నాగర్‌కర్నూల్ ఎంఈవో కార్యాలయం నుంచి సెట్ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా వ్యాప్తంగా పలు పరీక్ష కేంద్రాల ఛీఫ్ సూపరింటెండెంట్లతో మాట్లాడారు. డీఈవో వెంట జిల్లా విద్యాశాఖ పరీక్షల నిర్వహణ అధికారి రాజశేఖర్‌రావు, ఏంఈవో భాస్కర్‌రెడ్డి ఉన్నారు.


పాలెం పరీక్ష కేంద్రం వద్ద పరిశీలిస్తున్న జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్


నాగర్‌కర్నూల్ ఎంఈవో కార్యాలయం నుంచి సెట్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డీఈవో రమేష్‌కుమార్

● పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జోగుళాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శనివారం జిల్లా వ్యాప్తంగా 40 పరీక్షా కేంద్రాల్లో జరిగిన జీవశాస్త్రం పరీక్షకు 7,600 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 7,569 (99.59 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారని ఇన్‌చార్జి డీఈవో అబ్దుల్ ఘని, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. కాగా, గద్వాలలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను అసిస్టెంట్ కమిషనర్ పరిశీలించి అక్కడి పరిస్థితులను సీఎస్, డీవోలను అడిగి తెలుసుకున్నారు.

● నారాయణపేట జిల్లాలో పదోతరగతి పరీక్షలు శనివారం కొనసాగాయి. పరీక్షా కేంద్రాల్లోకి అర గంట ముందే విద్యార్థులను అనుమతించారు. జిల్లా వ్యాప్తంగా 39 పరీక్షా కేంద్రాల్లో 7,635 మంది విద్యార్థులకు గాను 7617 మంది హాజరయ్యారు. ప్రైవేట్ ఒక కేంద్రంలో 47 మంది విద్యార్థులకు 42 మంది రాశారని డీఈవో తెలిపారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం సభ్యులు ఆరు కేంద్రాలను పరిశీలించారు. సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు నాలుగు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. పరీక్షా కేంద్రాల దగ్గరికి విద్యార్థులు ఎనిమిదిన్నర గంటల వరకు చేరుకున్నారు.

● వనపర్తి జిల్లా వ్యాప్తంగా 36 కేంద్రాల్లో జరుగుతున్న పదవ తరగతి పరీక్షలలో శనివారం జీవశాస్త్రం పరీక్షకు 6840 మంది హాజరయ్యారని, 13 మంది గైర్హాజరైనట్లు జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘని ఒక ప్రకటనలో తెలిపారు. పెబ్బేరు మండల కేంద్రంలోని మాస్టర్‌మైండ్ పాఠశాలలో పరీక్ష కొనసాగుతున్న తీరును డీఈవో పరిశీలించారు.

● పదో తగగతి పరీక్షలు మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రశాతంగా కొనసాగుతున్నాయి. శనివారం నిర్వహించిన జీవశాస్త్రం పరీక్షకు 99.62 శాతం విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 12944 మందికి గాను 12,895 మంది విద్యార్థులు హాజరయ్యారు. రెగ్యులర్ విద్యార్థులు 12,769మందికి గాను 12,736 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రైవేట్ విద్యార్థులు 175 మందికి గాను 159 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను డీఈవో, జిల్లా స్థాయి పరిశీలకులు, స్క్వాడ్ బృందాలు, పరీక్షల పర్యవేక్షకులు తనిఖీలు చేశారు.

ఘనంగా పాగుంట వెంకన్న కల్యాణం


స్వామివారి కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు


ఆలయ పెద్దలకు నగదును విరాళంగా అందజేస్తున్న దాత ఉప్పెటి గోవిందురెడ్డి

కేటీదొడ్డి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలోని వెంకటాపురం గ్రామ సమీపంలోని కొండపై వెలసిన పాగుంట లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఉగాది అమావాస్య సందర్భంగా అర్చకులు, ఆలయ పెద్దలు స్వామి, అమ్మవారి కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. వేకువజామునే స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు పలురకాల అభిషేకాలు జరిపించి పట్టు వస్త్రాలు ధరించి వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలతో భక్తులతో కలిసి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, ఆలయ ప్రాంగణంలోకి తీసుకువచ్చి భక్తుల సమక్షంలో స్వామి, అమ్మవారి కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు బండ్ల రాజశేఖర్ రెడ్డి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపించి భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం ఆలయ పెద్దలు భక్తులతో కలిసి రథోత్సవాన్ని నిర్వహించారు. ఉగాది అమావాస్య కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి దాసంగాలు సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆలయ పెద్దలు, సిబ్బంది అన్ని ఏర్పాట్లను చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, ఆలయ పెద్దలు శేషిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

కల్యాణ మండపానికి రూ.లక్ష విరాళం

పాగుంట వెంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలో నిర్మించే కల్యాణ మండపానికి కర్నాటకలోని రాయచూరుకు చెందిన ఉప్పెటి గోవిందురెడ్డి రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఆలయ పెద్దలు, అర్చకులు దాతను శాలువాతో సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందించారు.

గుమ్మడి నర్సయ్యకు పురస్కారం



జిల్లా కేంద్రంలో పురస్కార కరపత్రం విడుదల చేస్తున్న సీఎస్ఆర్ ట్రస్టు చైర్మన్ సి.భాస్కర్‌రావు, కవులు

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 5న ఇల్లెందు నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు గుమ్మడి నర్సయ్యకు చింతలపల్లి నిర్మలా దేవి నారాయణరావు జీవన సాఫల్య పురస్కారం 2025ను అందజేయనున్నట్లు సీఎస్ఆర్ మెమోరియల్ సొసైటీ చైర్మన్ సి.భాస్కర్‌రావు తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలో స్థానిక కవులతో కలిసి పురస్కార కరప త్రాన్ని భాస్కర్‌రావు విడుదల చేశారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఏటా ఏప్రిల్ మాసంలో అందజేసే చింతప ల్లి నిర్మలాదేవి నారాయణరావు పురస్కారాన్ని కవులు, సామాజికవేత్తలు, ఉద్యమ కారులకు అందజేశామన్నారు. ఈ ఏడాది ఆదివాసీల హక్కులు, పంటలకు గిట్టుబాటు ధర, రైతాంగ సమస్య లపై నిరంతరం పోరాటం చేసిన యోధుడు, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్యకు అందజేసేందుకు సీఎస్ఆర్ ట్రస్టు నిర్ణయించిందని పేర్కొన్నారు. పుర స్కార గ్రహీతకు రూ.20 వేల నగదుతో పాటు శాలువా, మెమొంటోతో ఘనంగా సత్కరించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 5న జిల్లా కేంద్రంలోని తిరుమల ఫంక్షన్‌హాలులో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి జిల్లాలోని కవులు, కళాకారులు, మేధావులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

జిల్లాలోని కార్యక్రమంలో వనపట్ల సుబ్బయ్య, కందికొండ మోహన్, ముచ్చర్ల దినకర్, కల్వకోలు మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా శనేశ్వర స్వామికి తిల తైలాభిషేకాలు

-పరమశివుడికి రుద్రాభిషేకాలు, అర్చనలు


నంది వడ్డెమాన్‌లోని శనేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

బిజినేపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : సార్థసప్త జేష్టామాత సమేత శనేశ్వర స్వామికి భక్తులు శాస్త్రోక్తంగా తిల తైలాభిషేకాలు భక్తిశ్రద్ధలతో చేశారు. మండలంలోని నంది వడ్డెమాన్‌లోని నందీశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని శనైశ్వర స్వామికి ఫాల్గుణ మాసం కొత్త అమవాస్య శనివారం పురస్కరించుకొని వివిధ ప్రాంతాల నుంచి వందలాదిగా వచ్చిన భక్తులు నల్లని వస్త్రాలు ధరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి మాట్లాడుతూ అమావాస్య నాడు శనేశ్వర స్వామిని పూజించినా, ఆరాధించినా విశేష ఫలితం ఉంటుందని అన్నారు. అనంతరం గోన బుద్ధారెడ్డి కాలం నాటి బ్రహ్మసూత్రం ఉన్న పరమశివుడికి భక్తులు సామూహిక రుద్రాభిషేకాలు, అర్చనలు చేపట్టారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా వసతులు కల్పించడంతో పాటు అల్పాహారం, తాగునీటిని అందించినట్లు తెలిపారు. ఆలయ కమిటి సభ్యులు కెంచే రాజేష్, ప్రభాకర్, పుల్లయ్య, వీరశేఖర్, ఆలయ్య అర్చకులు గవ్వమఠం శాంతి కుమార్, ఉమామహేశ్వర్, సిబ్బంది గోపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

న్యూస్ బాక్స్

స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించాలి

ఆత్మకూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థలు, మునిసిపల్ ఎన్నికలపై బీజేపీ నాయకులు, కార్యకర్తలు దృష్టి సారించి అత్యధిక స్థానాల్లో గెలుపొందేలా కృషి చేయాలని ఆత్మకూరు మునిసిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ అశ్విన్ కుమార్ అన్నారు. పట్టణ కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శనివారం నిర్వహించిన బీజేపీ పట్టణ కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ, 6 గ్యారెంటీలను అమలు చేస్తామని ఇచ్చిన హామీలు తుంగలో తొక్కి ప్రజా పాలనను గాలికొదిలేశారని విమర్శించారు. అనిల్ గౌడ్, రాము, ఆనంద్, వెంకట్ రాములు, సూరి, చందు, బాలకృష్ణ పాల్గొన్నారు.

తెలంగాణలో సామాజిక న్యాయం సాధిద్దాం

వనపర్తి టౌన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి) : తరతరాలుగా తెలంగాణలో అణచివేతకు గురవుతున్న బీసీ, ఎస్సీ, ఎస్టీల సామాజిక న్యాయం కోసం మరో పోరాటానికి సిద్ధం కావాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వీరపాగ రామకృష్ణ పిలుపునిచ్చారు. డీఎస్పీ ఆధ్వర్యంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ రైట్స్ అండ్ రాజ్యాధికార జేఏసీ కరపత్రాలను శనివారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 31న హైదరాబాద్‌లోని బగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ రైట్స్ అండ్ రాజ్యాధికార జేఏసీని ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఈ ఆవిర్భావ కార్యక్రమానికి జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ సమాజంతో పాటు అగ్రకుల ప్రజాస్వామ్య వాదులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఎస్పీ నాయకులు చిన్నపాగ అశోక్, లక్ష్మణ్, రవి, నాగరాజు, చందు, కిరణ్, తారక్, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

రాములుకు ఘన నివాళి

వనపర్తి టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : రాములు ప్రథమ వర్ధంతి సభను సీపీఎం నాయకులు శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ జబ్బార్ కలిసి రాములు చిత్రపటానికి పూలమాలలతో నివాళి అర్పించారు. బాల్‌రెడ్డి, లక్ష్మీ, రాజు, బాలస్వామి, మదన్ పాల్గొన్నారు.

కురుమూర్తి ఆలయానికి పాదయాత్ర

అమరచింత, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా నుంచి ఉగాది పండుగ పురస్కరించుకుని శనివారం అమావాస్య సందర్భంగా కురుమూర్తి స్వామి ఆలయానికి పాదయాత్రగా వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏటా ఉగాది సందర్భంగా రాయచూర్ నుంచి 60 మంది భక్తులు పాదయాత్ర చేసి కురుమూర్తి స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహిస్తున్నామని రాయచూర్ భక్తులు అమరచింతలో విలేకరులకు తెలిపారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

వీపనగండ్ల, మార్చి 29, (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని తూముకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఎస్‌సీ 2005-06 బ్యాచ్ గద్వాల, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ సంస్థ వారు ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఎస్ఐ రాణి, మాజీ ఎంపీటీసీ రాములు శనివారం ప్రారంభించారు.

ఆకట్టుకున్న వేషధారణ



హర్యానా ప్రాంత ప్రజల వేషధారణలో...

వీపనగండ్ల, మార్చి 29, (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పీఎంశ్రీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా నృత్య నాటక ప్రదర్శన తెలంగాణ, హర్యానా వేషధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం, ఉత్సాహం పెంపొందిస్తాయని తెలిపారు.

టీడీపీ ఆవిర్భావమే ఒక సంచలనం

వనపర్తి టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : దేశ చరిత్రలో టీడీపీ ఆవిర్భావమే ఒక సంచలనమని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ టీడీపీ కన్వీనర్ బొలమోని రాములు అన్నారు. టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి పార్టీ జెండా ఆవిష్కరణ చేశారు. సుధాకర్ నాయుడు, దస్తగిరి, శ్రీను, లక్ష్మన్న, హుస్సేన్, శంకర్, చిన్నయ్య, బాల్‌రాం, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల గుండె చప్పుడు టీడీపీ

పెబ్బేరు : టీడీపీ బడుగు, బలహీన వర్గాల ప్రజల గుండె చప్పుడని టీ టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రామన్‌గౌడ్ అన్నారు. టీడీపీ 43వ ఆవిర్భావం సందర్భంగా శనివారం సుభాష్ చంద్ర బోస్ చౌరస్తాలో పార్టీ జెండాను ఆవిష్కరించి వేడుకలు జరుపుకున్నారు. సితార వెంకటేశ్వర్లు, బాలరాజు, రాఘవేందర్ గౌడ్, ఎల్లగౌడ్, రాజు శెట్టి, జానీ తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట : పట్టణంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి టీడీపీ జెండాను ఆవిష్కరించారు. జనార్దన్, కిషన్, శ్రీరాములు, జనార్దన్, జనార్దన్ సాగర్ పాల్గొన్నారు.



కొత్తకోటలో టీడీపీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

శిథిలమైన రక్షణ గోడ

- పొంచి ఉన్న ప్రమాదం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు, నాయకులు

మదనాపురం, మార్చి 29, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపల్లి బ్రిడ్జిపై రక్షణగా ఉన్న గోడలు దెబ్బతిన్నాయి. కొన్ని చోట్ల పూర్తిగా ధ్వంసమైంది. మరి కొన్ని చోట్ల శిథిలావస్థలో ఉంది. బ్రిడ్జిపై నుంచి ప్రయాణించే ప్రయాణికులు వాటిని చూసి జంకుతున్నారు. గోడలు దెబ్బతినడంతో బ్రిడ్జిపై కాలినడకన పొలాలకు వెళ్లే వారు... ఎదురుగా వాహనాలు వస్తుంటే పక్కకు జరగాలంటే భయంతో వణుకుతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి కొత్తగా సైడ్‌వాల్‌ను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



కొత్తపల్లి బ్రిడ్జి వద్ద దెబ్బతిన్న గోడలు

పట్టించుకునే వారు లేరు..



కొత్తపల్లి బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న సైడ్ వాల్స్ చాలా రోజుల నుంచి దెబ్బతిన్నాయి. ఈ బ్రిడ్జి నుంచి రోజు జిల్లా అధికారులు వెళ్తున్నా.. వాటిని పట్టించుకోవడం లేదు. ఏదైనా వాహనం అదుపు తప్పితే కిందికి పడిపోయేలా ఉంది. అధికారులు మరమ్మతులు చేపట్టాలి

- కుర్మన్న ప్రయాణికుడు

ప్రజా సేవ చేసే భాగ్యం అందరికీ దక్కదు



శ్రీకాంత్‌రావు దంపతులను సన్మానిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగం పొంది ప్రజా సేవ చేసే భాగ్యం అందరికీ దక్కదని, అలాంటి అవకాశాన్ని పొందిన ప్రభుత్వ ఉద్యోగులు నిబద్ధతతో ప్రజా సేవ చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. జిల్లా రెవెన్యూ విభాగంలో ప్రస్తుతం ఐ సెక్షన్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న నాయబ్ తహసీల్దార్ భక్తి శ్రీకాంతరావు ఉద్యోగ విరమణ సందర్భంగా దంపతులకు ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించారు. సమావేశానికి కలెక్టర్ ఆదర్శ్ సురభితో పాటు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యాదయ్య సహా శ్రీకాంతరావు కుటుంబ సభ్యులు, సన్నిహితులు, సహోద్యోగులు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ... ప్రస్తుతం ఉద్యోగ విరమణ పొందుతున్న శ్రీకాంత్‌రావు తన ఉద్యోగాన్ని క్రమశిక్షణ, నిబద్ధత అంకితభావంతో నిర్వర్తించారన్నారు.

డెంగీతో అప్రమత్తంగా ఉండాలి



పరిసరాలను పరిశీలిస్తున్న ఆశా కార్యకర్తలు

గోపాల్‌పేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : డెంగీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సాయినాథ్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో డెంగీ బారినపడిన బాధితుల వారి ఇంటి పరిసరాలను పరిశీలించారు. బాధితుల రక్త నమూనాలను సేకరించి డెంగీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్థులకు పలు సూచనలు చేశారు. డెంగీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలు తాము ఉండే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఐఈవో డాక్టర్ పరిమళమ్మ, కృష్ణకుమారి, సిద్ధాగౌడ్, నాగమణి ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



ఖిల్లాఘణపురంలో క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఖిల్లాఘణపురం, మార్చి29 (ఆంధ్రజ్యోతి) : బంజారా లంబాడీల గోర్ బోలీ భాషను అధికారిక భాషగా గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానించడం హర్షణీయమని డిస్ట్రిక్ డెవలప్‌మెంట్ కోఆర్డినేషన్ మానిటరింగ్ కమిటీ (దిశా) జిల్లా సభ్యులు రవి నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో శనివారం మండలంలోని కాంగ్రెస్ నాయకులు, గిరిజన లంబాడా నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి టపాకాయలు కాల్చి స్వీట్లు పంపిణీ చేస్తూ.. సంబురాలు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్ కుమార్, నాయకులు శ్యాంసుందర్ రెడ్డి, రాజు, రమేష్, ప్రకాష్, దేవుజా, విజయలక్ష్మీ, గోపాల్, రాములు, పాండు, గోవిందు, నారాయణ, దామోదర్ రెడ్డి పాల్గొన్నారు.

వన్ టైం సెటిల్‌మెంట్‌తో రుణ విముక్తులు కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న వంశీధర్‌రెడ్డి

కొత్తకోట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలిక రుణాలను వన్‌టైం సెటిల్‌మెంట్ చేసుకొని సింగిల్‌విండోలో రైతులు రుణ విముక్తులు కావాలని చైర్మన్ వంశీధర్‌రెడ్డి అన్నారు. శనివారం కార్యాలయ ఆవరణలో మహజన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సింగిల్‌విండో ఆర్థికంగా బలోపేతం అయితే రైతుల గృహ నిర్మాణాలకు రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. సమావేశంలో సీఈవో బాలరాజు, శ్రీనివాసులు, బాలకృష్ణారెడ్డి, భాస్కర్, నాగేంద్రం, మురళి, నరసింహులు, నాగరాజు, సువార్తమ్మ, రాంలాల్ నాయక్, లక్ష్మీ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

- పామాపురం సింగల్‌విండో మహజన సమావేశం అప్పరాలలో చైర్మన్ వాసుదేవ అధ్యక్షతన నిర్వహించారు. అంతకు ముందు ఈ ఆరు నెలల కాలంలో రైతులకు ఇచ్చిన రుణాలు వసూలు చేసిన బకాయిల పద్దులను చదివి రైతులకు వినిపించారు. సీఈవో రాఘవేందర్‌రెడ్డి, వెంకటయ్య, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రాయుడు, నాగిరెడ్డి, నీలవర్ధన్‌రెడ్డి, రామకృష్ణారెడ్డితో పాటు రైతులు లక్ష్మీకాంత్‌రెడ్డి, శంకర్, రవీ, సాయిరెడ్డి, కృష్ణయ్య, మెగలన్న తదితరులు పాల్గొన్నారు.

ఘన లింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



ఖిల్లాఘణపురంలో ప్రత్యేక అలంకరణలో వీరభద్ర స్వామి, గోపాల్‌పేటలో పల్లకీ మోస్తున్న భక్తులు

ఖిల్లాఘణపురం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఘన లింగేశ్వర, వీరభద్ర స్వామి ఆలయంలో శనివారం అమావాస్య సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులు భక్తిశ్రద్ధలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. మండల కేంద్రం పరిసర గ్రామాల ప్రజలు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పూజారులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ ఆవరణలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దాతల సహకారంతో 106 నెలలుగా ప్రతీ అమావాస్యకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అన్నదాన కర్త గోపి తెలిపారు.

గోపాల్‌పేట : మండలంలోని గండి ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం మాస శివరాత్రి సందర్భంగా బుద్దారం గ్రామ పరిధిలోని గండి ఆంజనేయ స్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేశారు. భక్తులు పాల్గొన్నారు.

అమరచింత : పట్టణంలోని శ్రీ శివ చౌడేశ్వరి, వెంకటేశ్వర స్వామి ఆలయాలతో పాటు నందిమల్ల, చంద్రఘడ్ నాగల్‌కడుమూర్ గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో ప్రత్యేక పూజలు చేశారు.

ఆంజనేయ స్వామికి..

వనపర్తి రూరల్ : వనపర్తి మండల పరిధిలోని అచ్యుతాపూర్ గ్రామ శివారులోని పంచముఖి ఆంజనేయ స్వామికి శనివారం అమావాస్య సందర్భంగా పూజలు చేశారు.

ఆదిబసవన్న ఆలయంలో అభిషేకాలు

శ్రీరంగాపూర్ : శ్రీరంగాపూర్ సమీపంలోని ఆది బసవన్న ఆలయంలో అమావాస్య సందర్భంగా శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



ఇఫ్తార్‌లో పాల్గొన్న చిన్నారెడ్డి, మేఘారెడ్డి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కృషి చేస్తుందని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా ప్రభుత్వం తరఫున వనపర్తిలోని స్టార్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, అఫ్జలుద్దీన్, తహసీల్దార్ రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ

విశ్వావసు నామ సంవత్సరం త్రైత శకం 47వ సంవత్సరం తెలుగు ఉగాది క్యాలెండర్‌ను శనివారం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. వెంకట్రాములు, బద్రీనాథ్, సురేష్ పాల్గొన్నారు.

తైబజార్ వేలం వాయిదా

ఆత్మకూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు తైబజార్ వేలం పాటను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఆత్మకూరు మునిసిపల్ కమిషనర్ శశిధర్ ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశానుసారం త్వరలో తైబజార్ వేలం తేదీని ప్రకటిస్తామని చెప్పారు.

మురుగు తొలగించాలి

పాన్‌గల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రేమద్దులలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మురుగు రావడంతో చాలా ఇబ్బంది పరిస్థితి ఏర్పడిందని ఎస్ఎఫ్ఐ గ్రామ కార్యదర్శి కుమార్ అన్నారు. శనివారం ఎస్ఎఫ్ఐ గ్రామ, పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ మురుగుతో దోమలు ఎక్కువై జ్వరాలు వస్తాయని అన్నారు. సమస్యకు పరిష్కారం చూపాలని గ్రామ పంచాయతీ కార్యదర్శికి విన్నవించినా పట్టించుకోవడంలేదన్నారు. వెంకటేష్, చరణ్ పాల్గొన్నారు.

నేడు సద్గురు సాయి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఆత్మకూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణ కేంద్రంలోని సద్గురు సాయి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు నూతన సంవత్సరాది విశ్వావసు నామ ప్రారంభ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని సద్గురువులకు పంచామృత అభిషేకములు చేయనున్నట్లు చెప్పారు.

ఆర్థిక సాయం అందజేత

పెబ్బేరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : పెబ్బేరు మునిసిపాలిటీలోని 2వ వార్డుకు చెందిన బలరామ్ శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ కౌన్సిలర్ అక్కమ్మ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అభయ హస్తం కింద వచ్చిన రూ.5 వేల ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

సీసీ రోడ్డు పనులు పరిశీలన

అమరచింత, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సింగంపేటలో సీసీ రోడ్డు పనులకు శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, అరుణ్ కుమార్, నరసింహులు గౌడ్, బాలయ్య, రఫీక్, వెంకటేష్, రంగన్న, కొండన్న, భీమన్న, రాకేష్, హరీష్ పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు

పెబ్బేరు రూరల్, మార్చి29 (ఆంధ్రజ్యోతి) : నాచనల్లి గ్రామం నుంచి వనపర్తి జిల్లా కేంద్రం వరకు ఉన్న బీటీ రోడ్డు తాత్కాలిక నిర్మాణం కోసం రూ.70 లక్షల నిధులను ఎమ్మెల్యే మేఘారెడ్డి సహకారంతో ప్రభుత్వం మంజూరు చేసిందని బ్లాక్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడు తెలిపారు. రోడ్డు గుంతలుగా ఉండడంతో వాహనదారు ఇబ్బందులు పడుతుండడంతో తాత్కాలిక నిర్మాణం పనులను చేపట్టడం కోసం నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు. పూర్తిగా డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపడం జరిగిందన్నారు. నిధులు మంజూరైన వెంటనే రోడ్డు విస్తరణ పనులు చేపడుతామన్నారు.

రోడ్డు రవాణా చట్టాన్ని అనుసరించాలి

వనపర్తి రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు రోడ్డుపై నడిచేటప్పుడు రోడ్డు రవాణా చట్టాన్ని అనుసరించి ఎడమ వైపున నడవాలని శ్రీ అసిస్టెంట్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది రఘు అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రజిని సూచన మేరకు శనివారం వనపర్తి మండల పరిధిలోని పెద్దగూడెంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మైనర్లకు నడపడానికి వాహనాలు ఇచ్చిన వాహన యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు అవుతాయని చెప్పారు. అలాగే చిన్న వయసులో ప్రేమ పేరుతో విద్యార్థినులను వేధిస్తే పోక్సో చట్టం కింద కేసు నమోదు అవుతాయన్నారు. ఉచిత న్యాయ సలహాల కోసం 15100 టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. పారా లీగల్ వాలంటీర్ రాజేందర్ కుమార్, రంగస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గెలుపు ఓటములు సమానంగా స్వీకరించాలి



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

పెద్దమందడి, మార్చి 29, (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో స్నేహభావం, ఐక్యత పెరుగుతాయని, అలాగే క్రీడల్లో గెలుపు, ఓటములు సమానంగా స్వీకరించాలని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని పామిరెడ్డిపల్లిలో ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా పామిరెడ్డిపల్లి ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నీని మాజీ మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. క్రీడలతో యువత మధ్య ఐక్యత పెరుగుతుందన్నారు. మొదటి బహుమతి రూ.20 వేల నగదును మాజీ మంత్రి ప్రకటించారు. అలాగే ద్వితీయ బహుమతి రూ.10 వేలు, తృతీయ బహుమతి రూ.5 వేల నగదును మాజీ ఎంపీపీ ఎం.మన్నెపురెడ్డి ప్రకటించారు. రవిచందర్‌రావు, గోవర్ధన్‌రెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, బి.నాగేందర్‌రావు, వడ్డె వెంకటయ్య, వెంకట్‌రాములు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తకోట : క్రీడా పోటీలతో స్నేహ సంబంధాలు పెంపొందించుకోవాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో కొత్తకోట మండల ప్రీమియర్ లీగ్ (కేఎంపీఎల్) దేవరకద్ర నియోజకవర్గ స్థాయి జీఎంఆర్ గోల్డ్ కప్ క్రికెట్ టోర్నీ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారుల నైపుణ్యం వెలికి తీయడానికి ఈ టోర్నీ పోటీలు చాలా ఉపయోగపడుతాయన్నారు. అంతకు ముందు సీడీసీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి (గొల్లబాబు) చిత్ర పటానికి నివాళి అర్పించారు. లీగ్ నిర్వాహకులు జీపీపీ న్యాయవాది మునగాల కృష్ణ, శివ యాదవ్‌తో పాటు మార్కెట్ చైర్మన్ ప్రశాంత్, శేఖర్‌రెడ్డి, బోయోజ్, కృష్ణారెడ్డి, బీచుపల్లి యాదవ్, శ్రీనివాసులు, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, జేసీబీరాము, గోకరయ్య, లతీఫ్, సాయులు యాదవ్, మిషేక్, సుల్తాన్, ఏజాజ్, బాలరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎండిన పంటల పరిశీలన



వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వీపనగండ్ల, మార్చి 29, (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సంగినేనిపల్లి, గోవర్ధనగిరి గ్రామాల్లో ఎండిపోతున్న వరి పంట పొలాలను మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్‌గౌడ్, ఏఈవోలు పరిశీలించారు. అడుగంటిన భూగర్భ జలాలు ఎండుతున్న వరి పంటలు అని 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి పంటలను పరిశీలించారు. రైతులను కలిసి నీటి లభ్యత పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. బోర్లు బావుల కింద ఎండిపోతున్న పంటల వివరాలను జరుగుతున్న నష్టాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని వ్యవసాయ అధికారులు తెలిపారు.

విద్యార్థులకు వాటర్ బాటిళ్ల వితరణ



వాటర్ బాటిళ్లతో మానాజీపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులు

ఖిల్లాఘణపురం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మానాజీపేటలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో వాటర్ బాటిళ్లను అందజేశారు. క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో సుమారు 600 వాటర్ బాటిల్స్‌ను ప్రభుత్వ పాఠశాలల్లో పంపిణీ చేస్తున్నామని చెప్పారు. క్లాస్‌మేట్ క్లబ్ మండల అధ్యక్షుడు విశ్వనాథం మాట్లాడారు. ప్రతీ రోజు విద్యార్థులు క్రమం తప్పకుండా నీటిని తాగాలని సూచించారు. ప్రతీ ఇంట్లో నీటిని వృథా చేయకుండా సంరక్షించాలని అన్నారు. విద్యార్థులు చేతిరాత, పఠన సామర్థ్యాలను పెంపొందించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో జయశంకర్, రాఘవేందర్, వెంకటేష్ గౌడ్, పల్లవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మంచిని గ్రహించి చెడును విస్మరించాలి



సదస్సులో మాట్లాడుతున్న ఎం.ఆర్ సునీత

వనపర్తి లీగల్ కంట్రీబ్యూటర్ మార్చి 29, (ఆంధ్రజ్యోతి) : బుద్ధి కుశలతతో జీవిత లక్ష్యాలను సాధించవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.ఆర్ సునీత అన్నారు. శనివారం వనపర్తి జిల్లా కేంద్రంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నెల రోజుల పాటు ఉచితంగా అందించిన ఆత్మరక్షణ విద్య శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు సమాజంలోని మంచిని గ్రహించి చెడును విస్మరించాలని, తల్లిదండ్రులు, గురువులు, పెద్దలపై గౌరవప్రదంగా నడుచుకోవాలని సూచంచారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి వి.రజని మాట్లాడారు. సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలను ఎదుర్కొవడానికి ఆడపిల్లలు, మహిళలు ఆత్మరక్షణ విద్య నేర్చుకోవాలని సూచించారు. ఉత్తమ ఆత్మరక్షణ విద్యను ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు అందించారు. సఖీ లీగల్ కౌన్సిల్ డి.కృష్ణయ్య, కరాటే మాస్టర్ శేఖర్, శివ, పాఠశాల ఉపాధ్యాయురాలు నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను మనతో సమానంగా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉత్తరయ్య

వనపర్తి వైద్యవిభాగం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : బుద్ధి మాంద్యం అంగవైకల్యం ఉన్న వారిని కూడా మనతో సమానంగా చూడాలని డిప్యూటీ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ ఉత్తరయ్య అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మానసిక వికలాంగుల హక్కులపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బుద్ధి మాంద్యం ఉన్న వారికి మానసిక వైద్యులతో మెరుగైన వైద్యం అందించాలని, అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఉచిత న్యాయ సేవల కోసం 15100కు ఫోన్ చేసి న్యాయ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్యానల్ లాయర్ శంకర్, పీఎల్‌వీ మద్దిలేటి, బండారు శ్రీనివాసులు, డ్యూటీ డాక్టర్స్ స్టాఫ్ నర్సులు, రోగులు పాల్గొన్నారు.